వక్రరేఖ

దీపావళి కథల పోటీలో రూ. 500 బహుమతి పొందిన కథ



కొలను వెంకట దుర్గాప్రసాద్

ఎడంచేత్తో అద్దం పట్టుకొని తన మొహాన్ని పరీక్షగా చూసుకున్నాడు రామం. నల్లటి చర్మం, లోతుకుపోయిన కళ్ళు, లోపలికి పోయిన దవడలు, తెల్లబడి పోతున్న తలవెంట్రుకలు—ఇదీ ప్రతిరూపం ఆ అద్దంలో!

భుజంమీద తువ్వాలుతో అద్దాన్ని బలంగా తుడ్చాడు. మళ్ళా మొహాన్ని చూసుకున్నాడు మార్పుకోసం వెతికాడు, కానీ మొదటి ప్రతిబింబానికన్నా, ఇప్పటి ప్రతిబింబం అతన్ని నిరుత్సాహ పరిచింది. అద్దాన్ని తుడవకుండా వున్నా పోయేది అనుకున్నాడు.

గడ్డం గీసుకున్నాడు. స్నానం చేసాడు. ఒళ్ళుతుడుచుకొని అద్దంలో మళ్ళా తన మొహాన్ని చూసుకున్నాడు దువ్వెనతో తల తృప్తిగా దువ్వుకున్నాడు కొద్దిగా పౌడరు చేతుల్లో వేసుకొని మొహానికి మరీతెల్లగా కనిపించకుండా రుద్దుకున్నాడు. మళ్ళా అద్దంలోకి చూసుకున్నాడు. తల వంకీలు తిరిగివుంది. తెల్ల వెంట్రుకలు మొదట కనిపించినంత విపరీతంగా కనిపించడంలేదు.

బట్టలు వేసుకున్నాడు. సూట్‌కేస్‌లో ఓ రెండుజతల బట్టలు సర్దాడు. క్రితం రాత్రే అమ్మా నాన్నకి చెప్పాడు 'ఆఫీసు పనిమీద వూరెళుతున్నట్టు.'

'అమ్మా! వెళ్ళొస్తాను' అంటూ ఇంట్లోంచి బైటపడ్డాడు. రిక్షా వేసుకొని స్టేషన్‌కి చేరాడు,

రామానికి ఇరవై అయిదోఏట ఉద్యోగం వచ్చి మొదటి పోస్టింగ్ ఏవూళ్ళో అయితే అయిందో, ఆ వూరికి ఈనాడు అతను మళ్ళా బయలుదేరాడు.

దాదాపు నాలుగయిదేళ్ళక్రితం—

ఉద్యోగం వచ్చిన కాయితాలు తీసుకొని రామం ఆ వూరు వెళ్ళాడు. ఆఫీసులో చేరాడు. వెంటనే రూము ఎక్కడా దొరక్క ఆఫీసులో వుండిపోయాడు రెండుమూడు రోజులు ఆ వూళ్ళో సంసారాలకయితే రెండు మూడు గదులున్న వాటాలు దొరుకుతాయిగాని, విడిగా రూము దొరకడం చాలా కష్టమైపోయింది. అటువంటి సమయంలో అతని అవస్థచూసి అతనితోపాటు అదే ఆఫీసులో మరో సెక్షన్‌లో పనిచేస్తున్న సుబ్బారావు ఓ రోజు వాళ్ల బాబాయి ఇంటికి తీసుకొని వెళ్ళాడు

అదొక చిన్న పెంకుటిల్లు. మొత్తం నాలుగు గదులు. వాళ్ళ ఎక్కువగా మూడు గదులు మాత్రమే వాడుకుంటున్నారు. నాలుగోగది ఖాళీగానేవుంది, ఏవో రెండు కుర్చీలూ, బుక్ షెల్ఫులూ తప్ప. ఆ గదికి విడిగా తలుపువుంది—బయటనుండి రాకపోకలకు.

ప్రక్కనే బావి వుంది. పెంకుటింటి చుట్టూ కాస్త స్థలం, అందులో కొన్ని పూలచెట్లు, కొన్ని కాయకూరల పాదులూ వున్నాయి. చుట్టూ గోడవుంది.

అక్కడంతా చాలా ప్రశాంతంగావుంది.

'ఏరా బావున్నావా? రా! కూర్చో' సుబ్బారావు బాబాయి సుబ్బారావునిచూసి అన్నాడు.

'మీరూ కూర్చోండి' అన్నాడు రామం వంకకూడా చూసి.

ఇద్దరూ కూర్చున్నారు.

'ఏరా! కనిపించడం మానేశావేం? అసలు రావడం మానేశావు ... అవునులేరా, నీకుకూడా పెద్దతనం వస్తోంది కదూ, నన్ను మర్చిపోతున్నావు' బాధగా అన్నాడాయన.

'తీరికలేక రావడంలేదు బాబాయి. చాలా దూరం కదా!' అన్నాడు సుబ్బారావు.

'అవునురా! మీరందరూ నన్ను దూరం చేసారు...నేనంటే చివరికి నీక్కూడా యిష్టం పోతోంది! అవునా? నిజం చెప్పరా!'

'బాబాయ్! నువ్వు ఏదో వూహించుకొని అనవసరంగా బాధపడిపోతున్నావ్'.

'ఏమోరా! ఈమధ్య నేను ఒంటరి వాడ్నయిపోయాననీ, అందరికీ దూరం అయిపోయానని నాలో నేను కుమిలిపోతున్నాను...ఒరే! సుబ్బారావు!...నేనెంతోకాలం బ్రతకనురా' అన్నాడాయన.

రామానికి ఏమీ అర్థంకాలేదు మౌనంగా కూర్చుండిపోయాడు.

'బాబాయ్! ఈయన పేరు రామం, మా ఆఫీసులో కొత్తగా జేరారు. వీరిది బెజవాడ. ఈయన వుండడానికి రూము కోసం చాలా వెతికారు, కానీ దొరకలేదు. మన యింట్లో ఏదన్నా వుందేమోనని తీసుకొచ్చాను, అన్నట్టు ఈయన మంచి ఆర్టిస్టుకూడా, ఇవాళే తెల్సింది. నువు కూడా చిన్నప్పుడు బొమ్మలు బాగా వేసే వాడివటగా. నువ్వు ఇకనుంచి ఒంటరిగా ఫీలవ్వనవసరం లేదు, ఈయనతో నీకు మంచి కాలక్షేపం' అని సుబ్బారావు రామం వంక తిరిగి 'ఈయనమా బాబాయి. పేరు జానకి రామయ్య, తాలూకాఫీసులో హెడ్ క్లార్కుగాచేసి రిటైరయ్యారు' అన్నాడు.

జానకి రామయ్య కాసేపు తన మనసులోని బాధని మర్చిపోయి రామం వైపు చూసి నవ్వి 'మీరు బొమ్మలు వేస్తారన్నమాట' అన్నాడు. ఆయన మొహంలో కొద్దిగా కళ వచ్చింది.

'అమ్మా రేఖా! మంచి నీళ్లు పట్టుకురామ్మా!' అని లోపలికి చూసి పిలిచాడు జానకి రామయ్య.

రేఖ రెండు గ్లాసుల్తో మంచినీళ్లు తెచ్చియిచ్చింది, సుబ్బారావుకి రామానికి.

'ఏం అన్నయ్యా! అసలు రావడం మానేశావూ?' అంది సుబ్బారావునిచూసి.

సుబ్బారావు మంచినీళ్లుతాగుతూ జవాబివ్వలేదు. రేఖ లోపలికెళ్లి మరో గ్లాసుతో తండ్రికి మంచినీళ్లు తెచ్చియిచ్చింది.

'చెల్లాయిలు బాగున్నారా?' అడిగింది.

'వాళ్లకేం, బ్రహ్మాండంగా వున్నారు... దిగులా, విచారమా?' నవ్వాడు సుబ్బారావు.

'అలా లేకుండా వుండడమేగా జీవితానికి కావల్సింది' జానకి రామయ్య అన్నారు.

రేఖ మంచినీళ్ళగ్లాసులు తీసుకొని లోపలికి వెళ్ళిపోయింది.

'మా అమ్మాయి రేఖ! ఎలిమెంటరీ స్కూల్లో టీచర్‌గా చేస్తోంది' జానకి రామయ్య రామాన్ని చూసి అన్నాడు.

రామం అలాగా అన్నట్టు తల కదిపాడు.

'ఏం బాబాయి? ఏమిటి మరి...రూము అద్దెకిస్తావా?'

'ఒక రూమే కదా!...అలాగే!' అన్నాడాయన.

రామం మనసు కుదుటపడింది—రూము విషయం తేలినందుకు

'మరి అద్దె సంగతి' సుబ్బారావు అడిగాడు.

జానకిరామయ్య నవ్వాడు 'అద్దెదేముందిరా! ..ఎంతో కొంత...'

'సరే, ఇప్పుడు నేనే రెంట్‌కంట్రోలర్ ననుకో...చూడండి రామం! ఈ గదికి మీరు పాతిక రూపాయలివ్వండి' అన్నాడు సుబ్బారావు నవ్వుతూ.

'అలాగే!' ఒప్పుకున్నాడు రామం.

జానకిరామయ్య దానికి 'చూడండి రామంగారు! మావాడు ఏదో అడిగాడు కదాని మీరు ఒప్పుకోకండి ... మీకు ఎంత ఇవ్వాలనిపిస్తే అంతే ఇవ్వండి...' అన్నాడు.

'అబ్బే! సుబ్బారావుగారు చెప్పారని కాదు, పాతిక రూపాయలు ఇవ్వడం నాకు యిష్టమే ...పోతే మా ఆఫీసులో పెట్టె బెడ్డింగూ వున్నాయి. రేపు ఉదయం వస్తాను. మీకు అభ్యంతరమయితే రెండు మూడు రోజులు ఆగే వస్తాను' అన్నాడు రామం.

'మీరిప్పుడే వచ్చినా నాకేమీ అభ్యంతరం లేదు' అన్నాడు జానకిరామయ్య.

రేఖ కాఫీ తీసుకొచ్చింది కప్పులతో. ముగ్గురికీ ఇచ్చింది. ముగ్గురూ తాగారు.

'వస్తాం బాబాయ్!' అంటూ సుబ్బారావు లేచాడు. రామం కూడా లేచాడు.

'అప్పుడప్పుడూ వస్తూవుండరా!' సుబ్బారావు చేతిని తన చేతిలోకి తీసుకుని అన్నాడు జానకిరామయ్య.

'నేను వస్తాను...తప్పకుండా...నువ్వేమీ బాధపడకు' అన్నాడు సుబ్బారావు.

'నేనున్నాగా, సుబ్బారావుగార్ని మీక్కావలసినప్పుడల్లా వెంట తీసుకొస్తాను' అన్నాడు రామం. దానికి జానకిరామయ్య హాయిగా నవ్వుకున్నాడు.

జానకిరామయ్య ఒక ముస్లిమ్ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆ కారణంగా వాళ్లిద్దరూ తమవారికి దూరం అయ్యారు వారికి రేఖ పుట్టింది. చదువు చెప్పించారు ఎస్సెల్సీ వరకు. తర్వాత టీచర్ ట్రైనింగ్ పొంది టీచర్‌గా చేరింది. జానకిరామయ్య భార్య రేఖ వివాహం ఓ సమస్య అని గమనించింది. ఆర్థిక పరిస్థితి కూడా అనుకూలంగా లేదు. ఆమె అనారోగ్యానికి తోడు రేఖ వివాహ సమస్య ఆమెని మరింత కృంగదీసింది. ఫలితంగా ఆమె మరణించింది. అప్పట్నుంచి జానకి రామయ్య ఒంటరివాడయ్యాడు. రేఖ పెళ్ళి గురించి భయపడ్డం మొదలుపెట్టాడు. తనవాళ్లెవరూ ఈ సమయంలో ఆదుకోవడంలేదనే బాధ ఎక్కువయింది ఆయనకు. 'నా పెళ్ళి గురించి నువ్వేమీ బాధపడకు నాన్నా! నాకు ఉద్యోగం వుంది. ఈ వయసులో నిన్ను వదిలి వెళ్ళలేను కూడా' అని రేఖ ఎప్పుడూ అంటూ వుంటుంది. కానీ ఆయనలో మార్పు రావడంలేదు.

ఈ విషయాలన్నీ రామానికి సుబ్బారావు తర్వాత చెప్పాడు.

రామం సామానుతో రూములో ప్రవేశించాడు.

రామానికి జానకిరామయ్యతో కాలక్షేపం కుదిరింది బాగా. ఇద్దరూ రేఖా చిత్రాల గురించి, నీటిరంగు చిత్రాల గురించి, ఆధునిక చిత్రకళ గురించి ..మాట్లాడుతూ కాలం గడిపేవారు. జానకిరామయ్య తన చిన్నతనంలో సంగతులన్నీ చెబుతుండేవాడు రామానికి. అవన్నీ రామం ఆశ్చర్యంగా వింటుండేవాడు.

'రేఖా! ఈ బొమ్మలు చూసావా? రామంగారు వేసారు...ఎంతో బాగున్నాయి కదూ?' అన్నాడు జానకిరామయ్య రేఖకు రామం వేసిన కొన్ని చిత్రాలను చూపిస్తూ.

'అవును నాన్నా! చాలా బావున్నాయి...

వక్ర రేఖ

నువ్వు కూడా మళ్ళా వేస్తూ వుండ కూడదూ...' అంది రేఖ తండ్రి వంక చూసి.

'అవునమ్మా! బొమ్మలు వేస్తూ వుంటే, కాలం, కష్టాలూ ఏవీ తెలియవు...వేస్తాను ...మళ్ళా వేయడం మొదలెడతాను' అన్నాడు.

'రంగులు, డ్రాయింగ్ పేపరు నా దగ్గ రున్నాయి. మీక్కావలిసినప్పుడు అడగండి' రామం అన్నాడు.

రోజులు గడుస్తున్నాయి.

ఆ రోజు రామం జీతం తీసుకున్నాడు. సాయంత్రం ఆఫీసు అవగానే రూము కెళ్ళాడు. రూము అద్దె ఇవ్వడానికి జానకి రామయ్య ఇంట్లోకి వెళ్ళాడు. కానీ ఆయన కనిపించలేదు.

'నాన్నగారు లేరా ?' అడిగాడు.

'లేరు; ఇప్పుడే అలా లైబ్రరీకి వెళ్ళారు' అంది రేఖ.

'రూము అద్దె...' రామం చేతిలోని డబ్బు చూపిస్తూ అన్నాడు.

'మా నాన్న వస్తారు, ఆయనకిస్తారా?' అంది.

'అలాగే!' అంటూనే వెనుతిరిగాడు.

'కూర్చోండి' అంది రేఖ.

రామం రేఖ వైపుకి తిరిగాడు. రేఖ లోపలికెళ్ళి కాఫీ తెచ్చి యిచ్చి 'తీసుకోండి' అంది.

'అబ్బే! ఎందుకండీ కాఫీ అవీను' రామం మొహమాట పడ్డాడు.

'కాఫీయే! అవీ ఇవీ లేవు' నవ్వింది రేఖ.

రామం కాఫీ కప్పు అందుకున్నాడు.

'మీరు వచ్చిన తర్వాత మా నాన్న కొత్తగా కనపడుతున్నారు. ఎప్పుడూ నవ్వుతూ కులాసాగా గడపగలుగుతున్నారు. ఇదివరకు ఆయన్నిచూసి నేను ఎప్పుడూ భయపడుతుండేదాన్ని, ఆయనకి ఏరోజు ఏమవుతుందోనని. ఆయన ఆరోగ్యం కుదుటపడడానికి కారణం మీరు — మీకు చాలా ఋణపడివున్నాను. ఆయన ఎంత కాలం బతికితే అంతకాలం నాకు ధైర్యంగా వుంటుంది. ఆయన లేకపోతే నాకు దిక్కెవరు?' కళ్ళల్లో నీరు తిరుగుతుండగా రామంతో అంది.

'ఆయనకేం ఫర్వాలేదు, మీరు బెంగ పెట్టుకోకండి' కప్పు ఆమెకు తిరిగి యిస్తూ అన్నాడు.

అప్పుడే జానకి రామయ్య లోపలికి అడుగు పెట్టాడు. కుర్చీలో కూర్చున్న రామంలేచి 'ఇదుగోండి—అద్దె' అంటూ ఇచ్చాడు.

జానకి రామయ్య నవ్వి 'ఒకసారి మీరు ఆలస్యంగా అద్దె ఇవ్వకూడదూ? చూడా లనివుంది' అన్నాడు.

రామం నవ్వి వూరుకున్నాడు.

ఆ రోజు రాత్రి—

రేఖ అరుపు వినపడింది. రామం అప్పుడే మగతగా నిద్రపోతున్నాడు. ఆమె అరుపు వినగానే గబగబాలేచి జానకి రామయ్య ఇంటి తలుపు తట్టాడు.

'నాన్నా! నాన్నా!' అంటోంది రేఖ ఏడుస్తూ.

బైటవున్న రామానికి అర్థంకాలేదు. తలుపు గట్టిగా కొట్టాడు. 'ఏమండీ... ఏమండీ...' అన్నాడు గట్టిగా.

ఓనిముషం తర్వాత రేఖ తలుపుతీసింది. ఆమె వణికిపోతోంది. కళ్ళనిండా నీళ్ళు...

'నాన్న...నాన్న...రండి...నాకు భయంగా వుంది' అంటూ లోపలికి పరుగెట్టింది. రామంకూడా అనుసరించాడు.

మంచంమీద జానకి రామయ్య గుండె పట్టుకొని విపరీతంగా రొప్పుతున్నాడు. రేఖ తండ్రిని రెండుచేతుల్తో పట్టుకొని 'నాన్నా! రామం వచ్చారు...' ధైర్యంగా మాట్లాడ్డానికి ప్రయత్నిస్తోంది ఏడవకుండా.

రామం జానకి రామయ్యని పట్టుకు న్నాడు. 'జానకి రామయ్యగారు ... ఏవి టండీ?...మీకేం భయంలేదు...' అంటు న్నాడుగానీ ఏంచెయ్యాలో తోచడంలేదు అతనికి. 'మీరు దగ్గరేవుండండి. నేను రిక్షా పిలుచుకొని వస్తాను ... హాస్పిటల్ కి తీసుకెళదాం' అంటూ బయటికివచ్చి తన గదిలో హేంగర్ కి వేలాడుతున్న ఓవర్కోటు అందుకొని, వేసుకుంటూ రోడ్డుమీదకి వచ్చాడు. రిక్షా దగ్గరిలో కనిపించలేదు. వందగజాలు గబగబా నడుచుకుంటూ వెళ్ళాడు. అక్కడో రిక్షా కనపడింది. 'ఇదిగో రిక్షా. త్వరగా పద' అంటూ రిక్షాఎక్కి, ఇంటిముందు ఆపించాడు. గబ గబా ఇంట్లోకి పరుగెత్తాడు. అప్పటికే

ఇరుగు పొరుగునవున్న కొంతమందివచ్చి గది నిండిపోయారు.

రేఖ తండ్రిమీదపడి ఏడుస్తోంది. రామం ఆయన శరీరాన్ని తాకాడు. చల్లగా అనిపించింది. ఒక్కసారిగా అతని కళ్ళు నిండి నీళ్ళు జలజలా రాలాయి. కాసేపటికి అంతా జనం పోగయ్యారు.

బేరం పోయిందని రిక్షావాడు తన దురదృష్టానికి తిట్టుకుంటూ వెళ్ళిపోయాడు.

తెల్లవారింది. కబురుతెలిసి సుబ్బారావు వచ్చాడు. మిగతావాళ్ళు ఎవరూ రాలేదని చెప్పొచ్చు. కర్మకాండలన్నీ సుబ్బారావు దగ్గరుండి జరిపించాడు.

ఇల్లు శూన్యమయింది.

రెండు రోజులు గడిచాయి.

రామం రేఖతో అన్నాడు 'నేను రూము ఖాళీ చేస్తున్నాను'

'ఎందుకని?' అడిగింది రేఖ.

రామానికి ఏం చెప్పాలో తోచలేదు. ఎలా చెప్పాలో తెలీలేదు.

'కారణం లేదా?' అడిగింది మళ్ళా.

'నేను ఇక్కడ వుండడం భావ్యం కాదని నా వుద్దేశ్యం...'

'అదే కారణం అయితే మీరు ఖాళీ చెయ్యనక్కరలేదు. మీ గురించి నాకు భయంలేదు. లోకం గురించీ నాకు భయం లేదు. ఇక నేనెవరికి భయపడదలుచుకో లేదు. నన్ను భయపెట్టేవాళ్ళూ లేరు... ఒకవేళ నా గురించి మీకు భయంగా వుంటే...ఖాళీ చెయ్యొచ్చు' అంది.

ఆమెకు జవాబు చెప్పలేక తిరిగి తన గదిలోకివచ్చి కూర్చున్నాడు. గది ఖాళీచేసే వుద్దేశాన్నుండి విరమించుకున్నాడు.

నెల రోజులు గడిచాయి.

ఇరుగూ పొరుగువారు తనగురించి అనుకోవడం, తను రోడ్డుమీదనుంచి వెళు తుంటే పరీక్షగా వాళ్ళల్లో వాళ్ళు గుసగుస లాడుకోవడం గమనించాడు రామం. పరిస్థితి అర్థం చేసుకున్నాడు

తనవూరికి ట్రాన్స్ఫర్ ప్రయత్నాలు మొదలెట్టాడు గట్టిగా.

రేఖ అప్పుడప్పుడూ రామం గదిలో కాసేపు కూర్చుని అతనువేసిన చిత్రాలను చూస్తూ కాలం గడిపేది. ఎంతదూరంగా వుందామన్నా రామానికి వీలుపడలేదు, రేఖ దగ్గరికి వస్తూ వుండడంతో.

రామంచేసిన ప్రయత్నాలు ఫలించి తన వూరికి ట్రాన్స్ఫర్ వచ్చింది. అతని సంతోషానికి మేరలేదు. మళ్ళా తనవూరికి, తల్లిదండ్రులదగ్గరికీ, తన పాత స్నేహితుల దగ్గరికీ వెళ్ళిపోతున్నందుకు సంబర పడ్డాడు.

సాయంత్రం కాగానే తిన్నగా రూముకి వచ్చాడు. బావిదగ్గర రేఖ నీళ్ళుతోడుతు కనిపించింది.

'నాకు మా వూరికి ట్రాన్స్ఫరయింది' అన్నాడు. రేఖ అతని సంతోషాన్ని గమనించి మెల్లగా నవ్వింది.

'అయితే మీ వూరు వెళ్ళిపోతున్నారన్న మాట' అంది.

నాలుగురోజుల తర్వాత రామం బదిలీ అయ్యాడు. ఆరోజు సాయంత్రం రూములోని కొంతసామాను రోడ్డు ట్రాన్స్పోర్టు ద్వారా పంపేసి, మిగిలిన సామాను సర్దుతున్నాడు రామం, గదిలో.

అప్పుడే రేఖ వచ్చింది.

'ఎప్పుడు వెళుతున్నారు' అడిగింది.

'రేపు ఉదయం' అన్నాడు.

'ఈపూట మా ఇంట్లో భోంచెయ్యాలి.. అడిగితే కాదనరని ముందే వంట చేశాను' అంది.

'వంట చేశారా?...' ఆశ్చర్యంగా అడిగాడు.

'అవును' అంది.

'ఇక తప్పేదేముంది...మీరిచ్చే కాఫీ కాదన లేకపోతూ వచ్చాను, అలా అలవాటయింది మరి ... ఇక భోజనం తయారు చేశాక... తప్పించుకోడం ఎలా?' అన్నాడు.

'సామాను పూర్తిగా సర్దలేదుగా ఇంకా' అడిగింది.

'లేదు.'

'అయితే సర్దుతూ వుండండి. వంట కాగానే పిలుస్తాను..' అంది. కానీ, 'అయ్యో నిజం తెలిసిపోయిందే' అని ఉలిక్కిపడింది.

'వంట అయిందన్నారు కదా?' అంటున్న రామం మాటలు వినిపించుకోకుండా వెళ్ళిపోయింది రేఖ. రామం నవ్వుకున్నాడు.

రాత్రి ఎనిమిదయింది. రేఖ మళ్ళా రామం గదిలోకి వచ్చింది. 'భోజనానికి లేస్తారా?' అడిగింది

రామం బావిదగ్గిరికివెళ్ళి కాళ్ళు కడుకున్నాడు. రేఖ ఇంట్లోకి వెళ్ళాడు.

'లోపలికి రండి ... కూర్చోండి' అంది లోపలి గదిలోకి పిలుస్తూ.

రామం వడ్డించిన విస్తరిముందు కూర్చున్నాడు. 'అబ్బో! చాలా చేసారు. ఇవన్నీ తినగలనా?' అన్నాడు.

'ఫర్వాలేదు, ఆమాత్రం తినలేరా?'

'తినలేను ... ఈ స్వీట్ తీసేయండి... గారెలు ఇన్నా? ఇవీ తీసేయండి' అన్నాడు. రేఖ తీసుకొచ్చిన ఖాళీ ప్లేట్లో తనకు ఎక్కువయినవి తీసి వుంచాడు.

'మీరు నా కోసమని అనవసరంగా చాలా చేసారు ... తినలేక పోతున్నందుకు ఏమీ అనుకోకండి.'

'మీరు తినలేకపోతే నేను చేసేదేముంది. అసలు మీరు భోజనానికి ఒప్పుకోరను కున్నాను. మీరు రావడం నా అదృష్టం...' అంది.

రామం రేఖవంక చూసాడు. ఆమె తల వంచుకొని కూర్చుంది ప్రక్కనే.

భోజనం ముగించాడు రామం. ముందరి గదిలోకివచ్చి కూర్చున్నాడు కుర్చీలో. రేఖ గుమ్మానికి ఆనుకొని నిలబడింది— రామాన్ని చూస్తూ.

రెండునిముషాలు గడిచాయి మౌనంగా.

రామం లేచాడు 'ఇక వెళతాను' అన్నాడు.

రేఖ గిరుక్కున అటువేపుకి తిరిగి పోయింది.

రామానికి అర్థం కాలేదు.

'ఏమండీ?' దగ్గరికెళ్ళి పిలిచాడు.

రేఖ ఇటువేపుకి తిరగలేదు. ఆమె ఏడుస్తోందని గ్రహించాడు. ఏం చెయ్యాలో తోచలేదు. తన గదిలోకి మామూలుగా వెళ్ళి పోదామనుకున్నాడు. అది సభ్యత కాదని వూరుకున్నాడు.

'రేఖా!...' ఇలా చూడండి!' అంటూ మొదటిసారిగా పేరుపెట్టి పిలిచాడు. కానీ రేఖ వెనక్కితిరిగి చూడలేదు.

రామం దగ్గరికివెళ్ళి అప్రయత్నంగా ఆమె తలపై చేయివేశాడు రేఖ రామం వైపు తిరిగి అతని గుండెలమీద వాలి పోయింది.

అనుకోకుండా జరిగిన ఈ సంఘటనకు ఉక్కిరిబిక్కిరి అయ్యాడు రామం రేఖ ఏడుపు ఆపలేదు. ఆమె రెండు భుజాలనూ పట్టుకుని 'ఇలా చూడండి' అన్నాడు

రేఖ అతని చేతులోంచి విడిపోయి అవతలి గదిలోకి వెళ్ళిపోయింది. రామం రెండు నిముషాలు నిలబడి, నిట్టూర్చి తనగదిలోకి తిరిగి వచ్చేశాడు.

రామం పడుకున్నాడేగానీ నిద్రపట్టలేదు.

'రేఖ తనని ప్రేమిస్తోంది. తనంటే ఆమెకు ఇష్టం. రేఖని తనదాన్నిగా చేసుకుంటే? తను సంఘంలో నిలబడగలడా? తనకంత ధైర్యం వుందా? రేఖని పెళ్ళిచేసుకుంటే తన ఇద్దరి చెల్లెళ్ళ పెళ్ళిళ్లు ఎలా అవుతాయి? జానకిరామయ్య లాంటి మనిషే తట్టుకోలేకపోయాడు. తనెంత? తనకు రేఖను చేసుకునే ధైర్యం లేదు...కానీ రేఖని ఎవరు చేసుకుంటారు? ఇన్నటికే ఇరవై రెండు, ఇరవై మూడుఏళ్ళు దాటివుంటాయి. జీవితాంతం ఎవరూచేసుకోకుండా అలా వుండిపోతుందా?...ఒంటరిగా ఎలా బ్రతుకుతుంది? అది ఆమెకు సాధ్యమా? కులం, గుణం, సంప్రదాయం అన్నీ సరిగ్గావుండికూడా ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు కావడంలేదు. ఇటువంటి పరిస్థితుల్లో రేఖను ఎవరు చేసుకోగలరు? అంతటి పుణ్యాత్ముడు, సాహసవంతుడు ఎవరుంటారు?'

రామం ఆలోచించలేకపోయాడు. ఎంత ఆలోచించినా తనకు రేఖని చేసుకోగల ధైర్యం లేదనుకున్నాడు.

తెల్లవారింది.

రిక్షా పిలిచి సామాను పెట్టించాడు గదులో.

రేఖ వాళ్ళ గుమ్మంలో నిలబడి వుంది. రాత్రి జరిగింది ఏమీ జ్ఞాపకం లేనిదానికి ఆమెల్లే కనిపించింది.

'వెళ్ళొస్తాను...రేఖా!' అన్నాడు.

'వెళ్ళిరండి' రేఖ నవ్వగలిగింది, కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నా.

రామం గబగబా వెనక్కి తిరిగివచ్చి రిక్షాలో కూర్చున్నాడు. రిక్షా కదిలింది.

సుబ్బారావు రామాన్ని స్టేషన్లో కలుసుకున్నాడు.

నాలుగయిదేళ్ళు గడిచిపోయాయి—

ఈ నాలుగయిదేళ్ళ కాలంలో రామం అప్పులుచేసి తన ఇద్దరి చెల్లెళ్ళ పెళ్లి

చేసాడు. అందరిలోకీ మంచివాడనిపించుకు న్నాడు. తనూ పెళ్లి చేసుకుందామనుకునే సరికి చుట్టూ అప్పులు కనిపించాయి. ఈ పరిస్థితుల్లో పెళ్లిచేసుకోకూడదని ఆగిపోయాడు. నాలుగేళ్లు దాటినా అప్పులు తీర్చవలసినవి మిగిలిపోయాయి. తల్లి దండ్రులు పెళ్లిచేసుకోమని బలవంతం చేశారు. 'నీ పెళ్లి కుదిరితే నీకొచ్చే కట్నంతో అప్పులు తీరిపోతాయి' అన్నారు. వాళ్ళ బలవంతంమీదే ఆరేడు సంబంధాలు చూసాడు. కానీ అమ్మాయిలు నచ్చలేదు. ఏదో ఓ లోపం. అతను చిత్రకారుడు కావడంతో మరింత చిక్కువచ్చింది. అతనికి ఎవరూ అందంగా కనిపించలేదు. రామానికి విసుగుపుట్టింది. ఇంకెవర్నీ చూడకూడదనుకున్నాడు. కానీ తల్లిదండ్రుల అతి బలవంతంమీద మరో సంబంధం చూసాడు. అమ్మాయి అతనికి నచ్చింది.

కానీ కట్నందగ్గర సంబంధం పోయింది. వాళ్లు రెండువేలకన్నా ఎక్కువ ఇవ్వలే మన్నారు. 'మావాడు మంచి ఉద్యోగంచేస్తున్నాడు. అంత తీసి పారేసినట్టు రెండువేలు కంటే ఎక్కువ ఇవ్వం అంటారా' అంటూ రామం తండ్రి ఆ సంబంధం వద్దనుకున్నాడు.

'కట్నం లేకుండి నాన్నా! అప్పులు మెల్లగా తీరతాయి. ఈ సంబంధం ఖాయ పరుచు!' అని చెబుదామనుకున్నాడు—కానీ, అసలు అమ్మాయికి తను నచ్చలేదనే వార్త విన్నాడు!

అప్పుడు రామం తనని అద్దంలో చూసుకున్నాడు, నల్లని చర్మం, లోతుకు పోయిన దవడలు, తెల్లబడిపోతున్న వెంట్రుకలు!

తనింతగా వడలిపోయాడా ?

ఈ నాలుగేళ్ళ కాలంలో తను చెల్లెళ్ళ పెళ్లి సంబంధాలు చూడడంలోనూ, అప్పులు చేయడంలోనూ, పెళ్లిళ్లు చేయడంలోనూ, తర్వాత బావమరదుల గొడవలు, కయ్యాలవల్ల అశాంతిగా గడపడంలోనూ, అప్పులు ఎలా తీరుతాయా అన్న ఆలోచనల్లోనూ, తన శరీరంలో ఎంత మార్పు వచ్చిందో గమనించాడు. 'తను నిజంగా అందవిహీనుడయ్యాడు, తన నెవ్వరూ ఇష్టపడి చేసుకోరు అనిపించింది.

అప్పుడప్పుడు మాత్రమే జ్ఞాపకమొచ్చే రేఖ ఆ సమయంలో తప్పనిసరిగా జ్ఞాపకమొచ్చింది, అతనిలో ఆశారేఖ పొడసూపింది.

'అవును. రేఖకి తనంటే ఎంతో ఇష్టం. అమ్మాయికి ఇంకా పెళ్లి కాలేదని నెల రోజుల క్రితమే సుబ్బారావు ఉత్తరం రాశాడు. ఇక తను ఏ సంబంధం చూడ లేదు. అందమైన అమ్మాయి దొరికినప్పటికిని, తనంటే ఇష్టపడి చేసుకొనే అమ్మాయి దొరకదు.

'వెంటనే బయలుదేరి వెళ్ళాలి—ఎవరికీ తెలియకుండా రేఖని పెళ్లిచేసుకోవాలి, ఇక ధైర్యం చేయాలి, తప్పదు! తన చెల్లెళ్ళ పెళ్లిళ్లు అయిపోయాయి. ఇక తను ఏం చేసినా ఎవరికీ నష్టం వుండదు.'

'రేఖగూడా సంతోష పడుతుంది. జానకి రామయ్యగారి ఆత్మ శాంతిస్తుంది. ఓమంచి పనిచేశాననే తృప్తి తనకీ వుంటుంది' అనుకున్నాడు.

* * *

రామం రిక్షాదిగి సూట్‌కేస్ చేత పుచ్చుకొని గేటులోంచి జానకిరామయ్య ఇంట్లోకి వెళ్ళాడు.

గుమ్మంలో ఎదురుగుండా రేఖ కనిపించింది.

'అబ్బ! రేఖ ఎంత అందంగా వుందిప్పుడు' అనుకుంటూ గుమ్మందగ్గర ఆగాడు.

రేఖ నవ్వింది. 'రండి! ఎంతోకాలానికి వచ్చారు. మీరు మళ్ళా వస్తారనుకోలేదు. జ్ఞాపకమున్నా నన్నమాట ... రండి! కూర్చోండి!' అంటూ లోపలికెళ్ళింది.

ఆమె మాట్లాడుతున్నప్పుడు ఆమె కళ్ళలోని నీళ్ళను గమనించాడు. 'అవి ఆనంద బాష్పాలు కావూ! తనంటే రేఖకి ఇంకా ఎంత ప్రేమ!' రామం గర్వపడ్డాడు. లోపలికెళ్ళి కూర్చున్నాడు.

'వీరు మావారు ... వీరు రామం...' అంది రేఖ తన భర్తని పరిచయంచేస్తూ.

'నమస్కారం' అన్నాడతను.

'నమస్కారం' అస్పష్టంగా అన్నాడు.

'మిమ్మల్ని గురించి రేఖ అప్పుడప్పుడూ చెప్తూ వుంటుంది—' అతను మాట్లాడుతున్నాడు.

కానీ, రామానికి ఏమీ వినిపించడం లేదు.